బడిదేవరకొండ ఆక్రమ లైసెన్స్ రద్దు చేయండి

బంగారి దొర కుటుంబానికి నష్టపరిహారం అందజేయండి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: బడిదేవర కొండపై గ్రానైట్ మైనింగ్ అన్ని అనుమతులతోనే జరుగుతున్నట్లు మైనింగ్ జిల్లా అధికారి సెప్టెంబర్ 15న ప్రకటన విడుదల చేసిందని, ఆ ప్రకటనలో ప్రభుత్వ అధికారులే తప్పులు చేసినట్లు అంగీకరించడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, గ్రామీణ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షులు బొత్స నరసింగరావు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. బడిదేవరకొండ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా లైసెన్స్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.ఎలుగుల మెట్టపై ప్రజాభిప్రాయసేకరణ చేసామని చెప్పిన మైనింగ్ అధికారి, బడిదేవర కొండపై కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేసామని ఎందుకు చెప్పలేదంతే, అక్కడ ప్రజాభిప్రాయ సేకరణే చేయకుండా గ్రానైట్ లీజు లైసెన్స్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించే దమ్ముందా అని సవాలిసిరారు. బడిదేవరకొండపై ఎక్కడ లైసెన్స్ ఇచ్చారో అక్కడ హద్దులు నిర్ణయించకుండా గ్రానైట్ త్రవ్వడానికి మైనింగ్ డిపార్ట్మెంట్ ఎలా అంగీకరిస్తుందని కొనియాడారు.అది మా రిజర్వ్ ఫారెస్టు ప్రభుత్వ భూమని, హద్దులు చూపమని ఫారెస్ట్ అధికార్లు ఎంత మొత్తుకున్నా ఎందుకు పట్టించుకోలేదని వాపోయారు. ఫారెస్టు అధికార్ల అభ్యంతరాలను నివృత్తి చేసి అనుమతులు ఇవ్వొచ్చని హై కోర్టు గతంలో ఆర్డర్ ఇచ్చిందని, ఫారెస్ట్ అధికార్ల అభ్యంతరాలు పట్టించు కోకుండా మైనింగ్ అనుమతులు ఎలా ఇచ్చారో, ఎవరి ఒత్తిడితో ఇచ్చారో తెలుసు చెప్పాలన్నారు. సిల్ట్ సిడిమెంట్ ప్రవాహాన్ని ఆపడానికి వర్కింగ్ పిట్ కోసం డ్రెయిన్ మరియు సిల్టేషన్ ప్లాంట్ నిర్మిస్తామని గ్రానైట్ కంపెనీ ప్రతినిధి ఇచ్చిన హామీకి వ్యతిరేకంగా గ్రానైట్ జరిగిందని అంగీకరించారు కదా! మరి రూల్స్ ఉల్లంఘించి సంవత్సర కాలంగా మైనింగ్ జరుగుతుంటే మైనింగ్ డిపార్ట్మెంట్ ఆపకపోవడం ప్రజలకు ద్రోహం చేసినట్టేనని వాపోయారు. దీనివలన చెరువు కబ్జాకు గురై పాడి బంగారి దొర మరణానికి కారణమైందని, కనీసం బంగారి దొర చనిపోయినా మైనింగ్ అధికార్లు గ్రానైట్ లైసెన్స్ ఓనరుపై కేసు పెట్టి, అరెస్ట్ చేసి పత్రికలకు తెలియజేయకపోవడంపై మండిపడ్డారు. గిరిజనులకు డి.పట్టాలు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చిన భూములను గ్రానైట్ మైనింగ్ కంపెనీ ఆక్రమించలేదని మైనింగ్ అధికారి సర్టిఫికెట్ ఇవ్వడంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికార్లు వచ్చి గిరిజనుల భూములు గ్రానైట్ కంపెనీ ఆక్రమించిందో తేల్చడంలో జాప్యం ఎందుకని నిలదీశారు. ఈ రకంగా మైనింగ్ అధికార్లు, రెవెన్యూ అధికార్లు, పర్యావరణ అధికార్లు, అందరూ తెలిసి చేసిన తప్పులేనని కనుక తక్షణమే బడిదేవరకొండపై గ్రానైట్ మైనింగ్ ఆపేయాలని, లీజు లైసెన్స్ రద్ద చేయాలని, అధికారులపై చర్యలు తీసుకోవాలని, బంగారి దొర మరణానికి కారణమైన గ్రానైట్ మైనింగ్ ఓనర్ను అరెస్టు చేయాలని బంగారి దొర కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కొండ రక్షణ కొరకు భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

మన్యంలో పర్యాటక సీజన్ నాటికి ఎన్.టి.ఆర్ పార్క్ సిద్ధం చేయాలి

అధికారులకు కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర రెడ్డి ఆదేశాలు

విశాలాంధ్ర-సీతంపేట : మన్యంలో పర్యాటక సీజన్ ప్రారంభం నాటికి ఎన్.టి.ఆర్ అడ్వెంచర్ పార్కును సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కు అభివృద్ధి కొరకు సూచించిన పనులన్నీ అక్టోబర్ మొదటి వారానికి పూర్తి కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సుందరమైన, వినోదభరితమైన ప్రదేశాల్లో ఎన్.టి.ఆర్ పార్క్ ఒకటని, దీన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పార్కుకు విచ్చేసే పర్యాటకులకు పచ్చదనం, పరిశుభ్రంతో మంచి ఆహ్లాదకర వాతావరణం కనిపించాలని పేర్కొన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా సెల్ఫీ పాయింట్‌లను ఏర్పాటు చేయాలని, గిరిజన యువత వివిధ రకాల షాపులను నిర్వహించుకునేలా అనుమతి ఇవ్వాలని, తద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటకుల అవసరాలు తీరుతాయని కలెక్టర్ వివరించారు. సీతంపేట పర్యటనలో భాగంగా సీతంపేటలోని ఎన్.టి.ఆర్ అడ్వెంచర్ పార్కును కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా నలుమూలల నుంచి ఈ అడ్వెంచర్ పార్కుకు పర్యాటకులు నిత్యం వస్తుంటారని అన్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల పార్కును మరింత శోభాయమానంగా తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ అధికారులను ఆదేశించారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు కనువిందు చేసేలా ప్రధాన ముఖద్వారం అద్భుతంగా కనిపించాలని, వెదురుతో సహజసిద్ధంగా ఉండేలా ఆర్చ్ ఉండాలని కలెక్టర్ సూచించారు. ఫోటో షూటింగులకు ఈ పార్కు అనుకూలమని, అందుకు తగిన విధంగా సుందరమైన ఫోటో పాయింట్ లను ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే సెల్ఫీలు తీసుకునేలా సెల్ఫీ పాయింట్ ను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పార్క్ కు వచ్చే పర్యాటకుల కొరకు అందమైన సిట్టింగ్ ఏరియా, పార్కులో ఎటుచూసినా అందంగా కనిపించేలా అద్భుతమైన పెయింటింగ్స్ కనిపించాలని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల కొరకు అవసరమైన అన్ని వస్తువులు ఇక్కడ లభించాలని, అలాగే కాఫీ, తినుబండారాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేసారు. పర్యాటకుల వినోదం కొరకు నిర్మించిన 5డి థియేటర్లతో పాటు పార్కు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వలన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని కలెక్టర్ వివరించారు.

అగ్ని ప్రమాద బాధితురాలి కుటుంబానికి మాజీ సర్పంచ్ రూ.2వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితురాలు యాడాది శ్రీదేవి కుటుంబాన్ని బుదవారంనాడు పలువురు పరామర్శించారు. సీతానగరంకు చెందిన మాజీ సర్పంచ్ లంక లక్ష్మీ 2వేల రూపాయలను అందజేశారు.

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను కలుసుకున్న ఎమ్మెల్యే బోనెల

విశాలాంధ్ర-పార్వతీపురం : హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అసెంబ్లీ సమావేశానికి హాజరైన బాలకృష్ణను స్పీకర్తో, మంత్రులు పాటు ఎమ్మెల్యేలు తన చాంబర్లో కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. అలాగే పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్ చంద్ర వ్యక్తిగతంగా బాలకృష్ణను కలుసుకుని పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. పార్వతీపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం అభినందనీయమని, మరింత అభివృద్ధి చేయాలని నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కోరారు.

ముఖ్యమంత్రికి పాలకొండ నియోజకవర్గ సమస్యలపై విన్నవించిన ఎమ్మెల్యే నిమ్మక

విశాలాంధ్ర-పాలకొండ/ సీతంపేట: పాలకొండ నియోజకవర్గం సమస్యలపై అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ని వారి ఛాంబర్ లో కలసి పాలకొండ నియోజకవర్గంలో గల ఈ దిగువ పేర్కొన్న సమస్యలు విన్నవించి సమస్యల పరిష్కారం చేయవలసినదిగా, ముఖ్యమంత్రిని కోరిన పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, పాలకొండ పట్టణం నందు గల ప్రధాన రహదారి (కళింగపట్నం-పార్వతీపురం రోడ్డు)ను భవిష్యత్ అవసరాల దృష్ట్యా వెడల్పు చేయుటకు, అభివృద్ధి పరుచుటకు రహదారులు మరియు భవనములు శాఖ ద్వారా రూ.16.50 కోట్ల రూపాయలతో మంజూరు చేయవలసిందిగా కోరారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థల పరిధిలో స్థానిక గిరిజనులకు మాత్రమే అర్హతగా నిర్ణయిస్తూ 2000 సంవత్సరంలో జారీ చేసిన జీ.ఓ. నెం.3ను పురుద్ధరిస్తూ, గిరిజనులకు న్యాయం చేయవలసినదిగా కోరారు. గిరిజన ప్రాంతాలలో గల గిరిజన రైతుల వ్యవసాయం మరియు వారి జీవనోపాధి అయిన ఉద్యానవన పంటల సాగు సుగమం మరియు సులభతరం చేసేందుకు అవసరమైన యాంత్రిక పరికరాలు మంజూరు చేసి పంపిణీ చేయుటకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, సీతంపేట పథక అధికారికి అనుమతి మంజూరు చేయాలని, పాలకొండ మండలం జంపరకోట గ్రామ పంచాయతీ పరిధిలో గల జంపరకోట జలాశయం నిర్మాణం అసంపూర్తిగా ఉందని, సదరు పనులు పూర్తి చేయుటకు రూ.30 కోట్ల రూపాయలు మంజూరు చేసి జలాశయం నిర్మాణం పూర్తి చేయుటకు తగు ఉత్తర్వులు జారీ చేయవలసినదిగా ఎమ్మెల్యే కోరారు. పాలకొండ నగర పంచాయతీ నకు డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉన్నదని, స్థల సమస్య తీర్చి, డంపింగ్ యార్డు మంజూరుకు తగు ఉత్తర్వులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పై సమస్యలపై స్పందిన ముఖ్యమంత్రి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి, అవసరమైన నిధులు మంజూరు చేస్తానని చెప్పారని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.

104 జిల్లా మేనేజర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-భామిని/సీతంపేట : 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ బామిని మండలం తాలాడా గ్రామంలో 104 వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనంలో అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. వాహనాన్ని తనిఖీ చేసి, పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలందించాలని అన్నారు. వారి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాల కండిషన్ ను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏదయినా మేజర్ ప్రాబ్లమ్స్ ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని అలాగే మందులు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకుని వచ్చినట్లైతే, వెంటనే అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తానని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆపరేటివ్ ఎక్సిక్యూటివ్ రాజశేఖర్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాట్నా ఉన్మేషా సమావేశానికి 'మల్లిపురం జగదీష్'కు ఆహ్వానం

విశాలాంధ్ర -కురుపాం : కేంద్ర సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడమీ ఆధ్వర్యం లో ఈనెల25-28వరకు పాట్నాలో నిర్వహిస్తున్న ఉన్మేషా సమావేశానికి అంతర్జాతీయ సాహిత్య పండుగ(పాట్నా)కు యువ రచయిత ఆదివాసీ కష్టాలను అక్షరాలతో బాహ్య ప్రపంచానికి తన రచనలతో కళ్ళకు కట్టిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు మల్లిపురం జగదీష్‌కు ఆహ్వానం వచ్చింది. ఈ అంతర్జాతీయ బాషా సమ్మేళనంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కవులు, రచయితలు హాజరుకానున్నారు. ఈ ఉన్మేషా సాహిత్య సంబరాలు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. కురుపాం మన్యంలో ఆదివాసీల కష్టాలు, జీవన స్థితిగతులు మూలధారంగా చేసుకున్న జగధీష్ తన రచనలతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు తెలియజేసారు. ఎన్నో అవార్డులు, పురష్కారాలు అందుకున్న ఆయనకు అంతర్జాతీయ సాహిత్య పండుగకు ఆహ్వానం మరో ప్రత్యేక గుర్తింపు. ఈ సందర్భంగా స్నేహకళాసాహితి సభ్యులు, గంటేడ గౌరునాయుడు, శాంతి, శ్రీనివాస్, పక్కి రవీంద్ర, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

స్వచ్ఛభారత్ మేనేజింగ్ డైరెక్టర్‌ని కలిసిన స్వచ్ఛభారత్ డైరెక్టర్ బొమ్మినాయిని

విశాలాంధ్ర-సీతానగరం : మండలానికి చెందిన రాష్ట్ర స్వచ్ఛభారత్ డైరెక్టర్ బొమ్మినాయిని లక్ష్మణరావు బుధవారం అమరావతిలో రాష్ట్ర స్వచ్ఛ భారత్ మేనేజింగ్ డైరెక్టర్ బి అనిల్ కుమార్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో జరుగుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలు గూర్చి వివరించారు. పార్వతీపురం పురపాలక సంఘంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం గూర్చి, డంపింగ్ యార్డ్ గూర్చి తెలిపినట్లు లక్ష్మణరావు తెలిపారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళగిరిలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి.అప్పలనాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి దశాబ్దాల కాలంగా అంతర్రాష్ట్ర (ఒడిస్సా)సమస్యతో ఆగిపోయిన ఝంఝావతి ప్రాజెక్టు రిజర్వాయర్ పూర్తి చేయడానికి తమ వంతు సహాయసహకారాలు అందించాలని రైతాంగాన్ని, ఆదుకోవాలని కోరామని తెలిపారు.తనతో పాటు రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు.వెంకట నాయుడు, మాజీజెడ్పీటీసీ తెంటు.వెంకట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల కో-ఆప్షన్ సభ్యునిగా నాలుగేళ్లు పూర్తి

అభివృద్ధి పనులు సంతృప్తినిచ్చాయి : నాజర్‌వల్లి

విశాలాంధ్ర-చింతపల్లి : జడ్పిటిసి, ఎంపీటీసీ లతో పాటు మండల కో ఆప్షన్ సభ్యునిగా నియమితులై నేటికీ నాలుగేళ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరంగా ఉందని స్థానిక మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి (బీబీసి బాబు) అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపిటిసి లతోపాటు తనను మండల కో ఆప్సన్ సభ్యునిగా ఆదరించి తనకు కేటాయించిన నిధులతో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేక్రమంలో తన కు కేటాయించిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు తనకు సంతృప్తిని ఇచ్చాయన్నారు. మిగిలిన పదవీకాలంలోనూ అందరి సహకారంతో మండలంలో అభివృద్ధి పనులకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

కిండలం-సీమనేరోడి వరకు 2 కిలోమీటర్లు రోడ్డు వేయాలి

గ్రామస్తులు డిమాండ్

విశాలాంధ్ర -పెదబయలు : మండలంలో కుంతుర్ల పంచాయతీలో గల మారుమూల కిండలం గ్రామం నుంచి సీమనేరోడి వరకు 2 కిలోమీటర్లు వరకు రోడ్డు మంజూరు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు మంగళవారం గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా బాబుజి మాట్లాడుతూ మొయ్యలగుమ్మి మెయిన్ రోడ్డు నుంచి కిండలం వరకు తారు రోడ్డు ఉన్నప్పటికీ కిండలం నుంచి 2 కిలోమీటర్లు దూరంగా ఉన్నా సీమనేరోడి కి మాత్రం ఎటువంటి రహదారి సదుపాయం లేదని రహదారి లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నమ్మన్నారని అన్నారు నిత్యవసర సరుకులు, రేషన్ ఈ మార్గనే నడుచుకుని వెళ్లి తెచ్చుకుంటున్నామన్నారు. గర్భిణీ స్త్రీలు, ఆరోగ్యం బాగులేకపోయినా సమయానికి అంబులెన్సు రాలేక కిండలం వరకు డోలిమోతాలతో తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు అనరు చిన్న వర్షం పడిన ఈ రహదారి గుండా నడవలేకపోతున్నమని కనీసం గృహాలు నిర్మించుకోవాలన్నా సిమెంట్, ఇసుక, ఇటుకలు వంటివి కిందకి మరొక కూలి ఇచ్చి గుర్రాలతో మోసుకెళ్తున్నామని తక్షణమే మా సీమ నేరడి గ్రామానికి రహదారి నిర్మాణం మంజూరు చేయాలనీ గ్రామస్తుల తో కలిసి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కిముడు శాస్త్రి బాబు, సర్భంనాయుడు, మత్యరాజు, గంగరాజు మహేష్, సన్యాసి నాయుడు, చిరు, చందు, చిన్నలదొర, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర-జిమాడుగుల : ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో రాజ్మా పంటలో రైజోబియం విత్తన శుద్ధి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ రైజోబియం ద్వారా విత్తన శుద్ధి చేయటం ద్వారా వచ్చే లాభాలు గురించి వివరించారు. అలాగే ఎలా చేయాలో కూడా రైతులకు విత్తనశుద్ధి చేసి చూపించారు. వరి పంటకు నానో యూరియా ఎంతో మేలు అని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో కె.వరప్రసాద్ చెప్పటం జరిగింది. మండలంలో నుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి జి.మాడుగుల మండల వ్యవసాయ అధికారి కె వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నిరకాల పంటలపై చీడ, పీడాల నివారణ మరియు ఎరువులను యాజమాన్య పద్ధతి వాటినివాడే విధానం గురించి క్లుప్తంగా రైతులకు తెలియజేశారు. ప్రధానంగా యూరియాకి బదులుగా నానో యూరియా ఉపయోగాలు ఎక్కువ అని జీవన ఎరువులైన ఫాస్ఫరస్ సొల్యూ బలైజింగ్ బాక్టీరియా, పోటాష్ రిలీజంగ్ బాక్టీరియా ద్వారా ఉపయోగాలు ఉన్నాయని అదేవిదంగా వరిలో ఆకు ముడత పురుగు అక్కడక్కడా కనిపిస్తుందనీ దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పి పౌడర్ పిచికారీ చేయవలసిందిగా రైతులకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నుర్మతి గ్రామపంచాయతీ సర్పంచ్ సూరిబాబు కూటమి నాయకులు వ్యవసాయ సిబ్బంది సూర్యనారాయణ, ప్రశాంత్‌కుమార్, ఉదయ్‌కుమార్ అలగే రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

చెత్త కేంద్రంలో పడేసిన ఓటర్ ఐడి కార్డులు

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం గూడెం కొత్త వీధి పంచాయతీ లో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రంలో ఓటరు గుర్తింపు కార్డులు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. భారత ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా తయారుచేసిన ఈ ఓటర్ గుర్తింపు కార్డులను ఓటర్లకు ఇవ్వకుండా చెత్త కేంద్రంలో పడేసారని గూడెం కొత్త వీధి బిజెపి మండల అధ్యక్షుడు కాకూరు శేఖర్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఎన్నికల భాగంగా ఈ ఓటర్ గుర్తింపు కార్డు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అలాంటి ఓటర్గుర్తింపు కార్డులు చెత్త కేంద్రంలో పారేయటం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. గూడెంకొత్తవీధి మండలంలో. దేవరపల్లి. పేద వలస. గూడెంకొత్తవీధి పంచాయతీలో అనేక గ్రామాల కు సంబంధించిన ఓటర్ గుర్తింపు కార్డులు ఈ చెత్త కేంద్రంలో ఉన్నాయన్నారు. ఇంకా నాలుగు నెలలలో వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయని ఇలాంటి టైములో ఓటర్ గుర్తింపు కార్డులు చెత్త కేంద్రాలలో పడెయ్యటం బాధాకరమని ఆయన పేర్కొన్నారు.రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంవల్ల ఈ కార్డును చెత్త కేంద్రంలో చేరాయని బాధ్యునిపై జిల్లా ఎన్నికల అధికారులు. జిల్లా మెజిస్ట్రేట్. &కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని. లేని పక్షంలో బిజెపి కేంద్ర పెద్దలకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వీధి సునకాలతో భయం భయం

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : ఎక్కడపడితే అక్కడ వీధి సునకాలు గుంపులు గుంపులుగా ఉండటం వల్ల ప్రతిక్షణం ఇక్కడి స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నామని వాపోతున్నారు. ప్రధానంగా మండల కేంద్రం నుంచి అరకు సంత బయలు వరకు ప్రధాన రహదారుల్లో వీధి సునకాలు గుంపులుగా గుంపులుగా ఉండటం వల్ల ఏ క్షణంలో ఎలా దాడి చేస్తాయో అర్థం కాక బయట తిరగలేక భయభ్రాంతులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి సునకాల వల్ల అనేకమంది దాడులకు గురై రాబిస్ షోకి మృతిచెందిన సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా వీధి సునకాలు చిన్నారులపై ఎక్కువగా దాడి చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండలంలో కురిసిన భారీ వర్షం

విశాలాంధ్ర-దుంబ్రిగుద : ఇటీవల బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత వారం రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా బుధవారం మండలంలో తెల్లవారుజామున నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించుకు పోయింది. మండల కేంద్రంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే మండల వాసులు వర్షం కారణంగా పలు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనుల నిమిత్తం వెళ్తున్న ప్రయాణికులు కురిసిన వర్షం కారణంగా పలు ఇబ్బందులు పడక తప్పలేదు.

ముల్లుమెట్ట గ్రామానికి తారురోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలో గల తడిగిరి పంచాయితీ, ముల్లుమెట్ట గ్రామానికి పీఎం జన్‌మాన్ తారు రోడ్డు పనులను మండల వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సర్పంచ్ పెనుమల రంజిత్ కుమార్, వైస్ సర్పంచ్ కిల్లో రామారావులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ బొడ్డపుటు జంక్షన్ నుండి ముల్లు మెట్ట వరకు రెండు కిలోమీటర్లు గ్రామానికి రూ.73లక్షల రూపాయలతో జన్‌మాన్ నిధులు మంజూరు అయ్యాయని అయినా ఉన్నారు. ఈ రోడ్డు మంజూరుకు సర్పంచ్, వైస్ సర్పంచ్, ఎంపీటీసీలు కృషినని ఆయన కొనియాడారు. రోడ్డు నిర్మాణంతో రవాణా కష్టాలు తీరనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వంతాల గాసన్న, పీసా ప్రెసిడెంట్ భవాని శంకర్, కిల్లో బుజ్జిబాబు, కిల్లో నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి కుర్చీల వితరణ

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి తెలుగుదేశం పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆ పార్టీ నాయకులతో కలిసి 20 కుర్చీలు వితరణగా స్థానిక తహసిల్దార్ ఆనందరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్ణచంద్రరావుతో పాటు ఆ పార్టీ పిఎసిఎస్ చైర్మన్ అబ్బాయినాయుడు, చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనంద్, అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, చౌడుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.మధు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భవనాల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- అక్టోబర్ 15 నాటికి నిర్మాణ భవనాలు అప్పగించాలి
- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమని శ్రీపూజ

విశాలాంధ్ర-దుంబ్రిగుద : మండలంలో పలు భవనాల నిర్మాణ పనులు అక్టోబర్ 15 నాటికి అందజేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రెగ్యులర్ ఇన్స్పెక్షన్‌లో భాగంగా బుధవారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమని శ్రీ పూజ మండలంలో పలు నిర్మాణ భవనాలు సందర్శించారు. ఇందులో భాగంగా అరమ గ్రామం పంచాయతీ లో హెల్త్ సెంటర్ ను, గోశంబో గ్రామం ఆరమ పంచాయతీలో మల్టీపర్పస్ సెంటర్‌ను, దుంబ్రిగుడ గ్రామంలో గిరిజన ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ హాస్టల్ స్కూల్స్ బాయ్స్, కొర్ర గ్రామం, పంచాయతీలో అంగన్వాడి సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ భవనానికి ప్రహరీ గోడకు ప్రపోజల్స్ పెట్టమని అధికారులు ఆదేశించారు. భవనాలు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. నాణ్యత వెరిఫికేషన్ ప్రొసీజర్‌పై ఆరా తీశారు. భవనాల విస్తీర్ణ, భవనాల అంచనాల వ్యయం అడిగి తెలుసుకున్నారు. అక్టోబర్ 15 కల్లా హెల్త్ సెంటర్ మల్టీపర్పస్ సెంటర్‌ని నిర్మాణ పనులు పూర్తిచేసి అందజేయాలని అధికారులు ఆదేశించారు. భవనాలు ఉపయోగంలో వచ్చాక గిరిజన ప్రజలు ఎంతమంది లబ్ధిపడతారని ఆరా తీశారు. నిర్మాణ మొదటి స్టేజ్‌లో ఉన్న భవనాలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కొర్ర గ్రామంలో గ్రామస్తులు అంగనవాడి భవనం లేక ఇబ్బందికి గురవుతున్నారని త్వరితగత నిర్మాణ పనులు పూర్తి చేసి ఉపయోగంలో తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ ట్రైబల్ వెల్ఫేర్ దుంబ్రిగుడ టీ. అభిషేక్, సిడిపిఓ ఇస్తారు రాణి, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలంటూ 3వ రోజుకు చేరుకున్న అరణ్య గర్జన జీపు జాతా

విశాలాంధ్ర-హుకుంపేట: మండలంలో అరణ్య గర్జన జీపు జాతా 22వ తేదీ నుండి మొదలై మూడవ రోజుకు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనరస డిమాండ్ చేశారు. అధివాసులకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ప్రత్యేక హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు వాటిని నిర్వీ ర్యం చేయడానికి పథకం ప్రకారం కుట్ర చేస్తున్నారని ఆయన అన్నారు.అందులో బాగంగా నే మజ్జివల స,లోతేరు,గుమ్మకోట, పెదకోట, బస్కి తో పాటు మొత్తం 30 స్థలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి పూను కొన్నారని ఆయన అన్నారు. నవయుగ అదానీ బడా కార్పొరేట్ కంపెనీలకు 5వ షెడ్యూల్ ప్రాంతం లోను భూములను అప్పనంగా అప్పజెప్పిందన్నారు.వీటిపై ఆదివా సులు తీవ్రంగా ఆందోళనలు నిరస నలు చేపట్టిన ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ఈ అరణ్య గర్జన యాత్ర ఆదివాసీ హక్కుల రక్షణ, పర్యావరణ, పరిరక్షణ కోసం నిర్వహించబడిన ఒక శక్తివంతమైన ఉద్యమం. అని ఆయన అన్నారు. ఈ యాత్ర ద్వారా, హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీ సముదాయాలు ఎదుర్కొంటున్న అన్యాయా లను, పర్యావరణ నష్టాన్ని బహిర్గ తం చేయడం లక్ష్యం గా పెట్టుకున్నమన్నారు. ఆదివాసీల ఐక్యతను వారి హక్కుల కోసం పోరాటాన్ని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.స్థానిక ఆదివాసీలతో సంప్రదిం పులు జరపకుండా తగిన పరిహారం అందించకుండా భూములను స్వాధీనం చేస్తున్నారని, ఆయ న తెలిపారు.ఇది ఆదివాసుల హక్కుల ఉల్లంఘనే నని ఆయన అన్నారు. అందుకు నిరసిస్తూ ఈనెల 27న మజ్జివలసలో నిర్వహిస్తున్న అరణ్య గర్జన మహాసభను విజయ వంతం చేయాలనీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వి లక్ష్మణ్ రావు, సిపిఎం పార్టీ నాయకులు, జీపు జాత బృంద సభ్యులు కె త్రినాథ్, ఎస్ ధర్మన్న పడాల్,టీ క్రిష్ణారావు,ఎస్ హైమావతి, వి లక్ష్మణ్ రావు, అప్పాలకొండ పడాల్, డి కృష్ణమూర్తి, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని తాకిన సంబరాలు

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ నగర పంచాయతీ పరిధి ఐదవ వార్డులో ఉన్న గాయత్రీనగర్ తదితర కాలనీవాసులు బుధవారం శ్రీ కోటదుర్గమ్మ తల్లి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అంబరాన్ని తాకిన సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు సుమారు 100 ఘటాలతో ప్రత్యేక అలంకరణలతో డప్పుల వేషాలతో సంబరాలు చేసుకున్నారు అడుగడుగునా భక్తి పరవశంతో శ్రీ కోటదుర్గమ్మ తల్లి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సంబరాలు ఆ కాలనీవాసులు ఐదవ వార్డు కౌన్సిలర్ వెలమల మన్మధరావు కమిటీ సభ్యులు సాహిని శ్రీనివాసరావు బలివాడ సురేష్ కుమార్ ఆనందరావు మోహన్ రావు తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

అడవి నుంచి ఆదివాసులను గెంటివేసే కుట్రను ఐక్యంగా తిప్పికొట్టాలి

సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పల నరస పిలుపు

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : ఆదివాసి అడవి పుత్రులను అడవి నుంచి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు గెంటివేసే కుట్రను ఆదివాసి గిరిజనులు ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి అప్పల నరస పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ నిర్మాణంకు వ్యతిరేకంగా ఆదివాసి గిరిజన సంఘం , హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ చేపట్టిన అరణ్య గర్జన జీపుజాత బుధవారం మండలంలో చేరుకుంది. ఈ సందర్భంగా జాకర వలసలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి వనరులను దోపిడి చేసుకోవడానికి కార్పొరేట్ ప్రవేట్ కంపెనీలతో ప్రభుత్వం అక్రమ ఒప్పందాలు చేసుకున్నా యన్నారు. ఈఒప్పందాలు రాజ్యాంగ విరుద్ధమైనవని చెప్పారు. స్థానిక సర్పంచ్ లు, పీసా కమిటీ సభ్యులు హైడ్రోపవర్ ప్లాంట్ కు వ్యతిరేకంగా తీర్మానం చేయగా, మరోపక్క ఆదివాసి గిరిజనులు ఆందోళన చేపడుతున్న ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. గత ప్రభుత్వం మంజూరుచేసిన విద్యుత్ ఉత్పత్తి మెగావాట్లను పెంచుతూ చిట్టంవలస, పెదకోట, గుజ్జెలీలో హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్టులకు ప్రభుత్వం జీవో నెంబర్ 13, జీవో నెంబర్ 51ను జారీ చేసి ఆదివాసులను రెచ్చగొట్టే చర్యకు పూనుకొని, ప్రశాంతమైన గిరిజన ప్రాంత వాతావరణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రభుత్వం పూనుకోవడం సరైనది కాదని చెప్పారు. ఈ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల సుమారు 30వేల ఎకరాలు అటవీ, వ్యవసాయ భూములను ప్రైవేట్ కంపెనీలకు కేటాయించడం దారుణం అన్నారు. ప్రభుత్వం అనుమతించిన ఐదు ప్రాజెక్టుల్లో సుమారు 50 వేల మంది జల సమాధి కాబోతున్నారని పేర్కొన్నారు. ఈ హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ నిర్మాణంపై అపోహలొద్దని అధికార పార్టీ పత్రికల్లో తప్పుడు ప్రచారాలు చేయించడం ప్రభుత్వం శృతిమించి వ్యవహరిస్తుందని భావించవలసి వస్తుందన్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేయడం కోసం గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసి నిర్బంధించడం బావ ప్రకటన స్వేచ్ఛకు వ్యతిరేకమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే త్రినాథ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.బి.పోతురాజు, మండల నాయకులు పి.సురేష్ కుమార్, పి.సత్యనారాయణ, టి సూర్యనారాయణ, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాలల్లో శక్తి టీంలు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్‌రెడ్డి ఉత్తర్వుల ప్రకారం పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాన ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్స్, పోలీస్ అధికారులు, సిబ్బంది బుధవారం పార్వతీపురం పట్టణంలో గల ఆర్కే జూనియర్ కళాశాల, జనహిత డిగ్రీ కళాశాల, ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలను సందర్శించి అందులో గల విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఈగిల్ మరియు బాల్య వివాహాలు, డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి శక్తి టీం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందని అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించడం, ఒక బటన్ నొక్కడం ద్వారా లేదా ఫోన్ షేక్ చేయడం ద్వారా మహిళలు అలర్ట్/ఎస్ఓఎస్ ను సమీపంలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కి పంపే సౌకర్యం, మహిళలు తమ లైవ్ లొకేషన్‌ను పోలీసులకు మరియు ఎంచుకున్న అత్యవసర కాంటాక్ట్‌లకు షేర్ చేసే వీలును కల్పిస్తుందని, జాతీయ అత్యవసర హెల్ప్‌లైన్ తో అనుసంధానం చేయడం ద్వారా పోలీసుల తక్షణ స్పందనను పొందే అవకాశం ఉందని, మహిళలు ప్రజా ప్రదేశాల్లో, ప్రయాణంలో మరింత సురక్షితంగా ఉండేందుకు తోడ్పడుతుందని, నేరాలను అరికట్టడానికి, తప్పిదకారులను నిరుత్సాహపరచడానికి వేగవంతమైన పోలీస్ జోక్యాన్ని ప్రోత్సహిస్తుందని, మొత్తంగా శక్తి యాప్ అత్యవసర సహాయాన్ని ఒక్క టచ్ దూరంలోకి తెచ్చి, మహిళల భద్రతను బలోపేతం చేయడం దీని లక్ష్యం అని విద్యార్థులకు తెలియపర్చారు. డ్రగ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ యాప్ ఎలా వియోగించుకోవాలో అవగాహన కల్పించారు. ప్రతిచోట ధైర్యంగా తమకు ఏ సమస్య వచ్చినా శక్తి యాప్ టోల్ ఫ్రీ నెంబరు 112 లేదా వాట్సాప్ నెంబర్ 7994385111కి కాల్ చేయాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో పార్వతీపురం శక్తి టీం ఇంచార్జ్ మరియు ఎఎస్ఐ లెంక శ్రీనివాస రావు (1154), మహిళా కానిస్టేబుల్ ఎన్. పద్మ (492), శక్తి టీం-1 పార్వతీపురం సిబ్బంది పాల్గొన్నారు.

మనుమకొండ గ్రామం అభివృద్ధికి కృషి

కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర్ రెడ్డి

విశాలాంధ్ర-సీతంపేట : నీతి అయోగ్ ద్వారా ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద ఆదర్శ గ్రామంగా ఎంపికైన భామిని మండలంలోని మనుమకొండ గ్రామం అన్ని విభాగాల్లో అభివృద్ధి పథంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఐటీడిఎ మీటింగ్ హాల్లో భామిని మండలానికి చెందిన మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టి వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. నీతి అయోగ్ సూచించిన 40 సూత్రాలను అమలు చేయాలని సూచించారు. నీతి అయోగ్ ద్వారా మంజూరైన మోడల్ అంగన్వాడి భవనాలు త్వరితగతన ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా మిగిలిన శాఖలకు సంబంధించి మంజూరైన అన్ని పనులు ప్రారంభం కావాలని అన్నారు. గ్రామంలోని అందరికీ ఆరోగ్య కార్డులు ఉండాలని అన్నారు. అదే విధంగా భామిని మండలంలో ప్రతి గ్రామానికి స్మశానవాటిక ఉండాలని సూచించారు. ప్రతీ చెరువును ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేయాలని అన్నారు. కొత్తగా ఫారం పాండ్ పనులను చేపట్టాలని సూచించారు. వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని అన్నారు. గ్రామాల్లోని సర్పంచులతో సమావేశం నిర్వహించి వారి గ్రామాలకు అవసరమయ్యే అభివృద్ధి పనుల ప్రణాళికను తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భామిని తహసిల్దార్, ఎంపీడీవో ఇతర మండల స్థాయి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీతంపేట మండలం మండ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో పిల్లలతో కాసేపు ముచ్చటించారు. పిల్లలతో వివిధ రకాల ఆటలను కలెక్టర్ స్వయంగా ఆడించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటపాటల ద్వారా చదువు నేర్పించాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా గ్రామంలోని వీడివీకే కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వీడివీకే ద్వారా ఉత్పత్తి చేస్తున్న గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, వీటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వీడివీకేలో రికార్డులను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని అన్నారు.ఈ పర్యటన కార్యక్రమాల్లో ఐటీడిఎ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఏపీవో జి.చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, డీఈ నాగభూషన్, హౌసింగ్ ఈఈ, ఎంపీడీవో, తహసిల్దార్, సీడీపీవో, తదితరులు పాల్గొన్నారు.

ధర్మ యుద్ధం బహిరంగ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఎటపాక : బుధవారం ఆదివాసి సంక్షేమ పరిషత్, టాప్ టెన్ టీం చట్టబద్ధతలేని లంబాడీలను తొలగించాలని భద్రాచలంలో జరిగే ధర్మ యుద్ధం బహిరంగ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్ర లితెలంగాణ రాష్ట్రంలో చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించి మా నిధులు, నియామకాలు, రిజర్వేషన్లు మాకే కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 1976 సంవత్సరంలో లంబాడీలను ఎస్టీ జాబితాలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ స్వలాభం కోసం అక్రమంగా చేర్చి ఆదివాసీలను అన్యాయానికి గురిచేసిందన్నారు. 1975 నుంచి 1977 వరకు దేశంలో ఎమర్జెన్సీ ఉన్న కాలంలో దేశవ్యాప్తంగా చట్టసభలు పనిచేయని కాలంలో లంబాడీలకు చట్టబద్ధత ఎలా వచ్చిందని దుయ్యబట్టారు. తెలంగాణ ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నటువంటి ఆదివాసీ ప్రజాప్రతినిధులు ఆదివాసీ కుల సంఘ నాయకులు మహిళలు విద్యార్థులు ఉద్యోగులు కార్మికులు కర్షకులు మలిదశ లంబాడీల తొలగింపు ఉద్యమానికి సిద్ధం కావాలని జాతి మనుగడకు బాసటగా నిలువాలని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గ్రామ గ్రామన జేఏసీలు ఏర్పాటు చేసుకొని రాస్తా రోకోలు ధర్నాలు వంట వార్పు ఆదివాసీ మార్చులు, ఉద్యోగులు పెన్ డౌన్ లాంటి నిరసన కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ముందుకు నడ ఉద్యోగులు, ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు, కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 28న భద్రాచలంలో జరిగే ఆదివాసి ధర్మ యుద్ధం సభను విజయవంతం చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యకర్తలకు, ఆదివాసి ప్రజానీకం పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాడిస వెంకటేశ్వర్లు, కంగాల కోటేశ్వరరావు, తుర్రం అర్జున్, గుండి లక్ష్మణ్, కొమరం మల్లు, కలూరి చలపతి, మడకం జోగయ్య, కారం. వేంకటపతి, సరియం నాగేశ్వరరావు, పార్వతి పాల్గొన్నారు.

'ఆయా' పోస్ట్‌కు దరఖాస్తు ఆహ్వానం

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : డుంబ్రిగుడ మండలం ఐసీడీఎస్ పరిధి తూటంగి పంచాయతీ పీటీజీ గ్రామం బుడ్డింగి అంగన్వాడీ కేంద్రంలో సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు స్వీకరిస్తున్నామని సీడీపీవో ఎస్తేరురాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి సహాకురాలి పోస్టు భర్తీకు దరఖాస్తును ఆహ్వానిస్తున్నామన్నారు. పదో తరగతి ఉతీర్ణత అయ్యి ఉండి 35 ఏళ్లలోపు మహిళ అభ్యర్థి అయ్యి ఉండాలన్నారు. 24 నుంచి వచ్చే నెల 8వరకు కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించనున్నామని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళ అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

వరిలో పోటాష్ బదులు జిల్లేడు ద్రావణం

విశాలాంధ్ర-మక్కువ : మండలంలోని దుగ్గేరు గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ డిపిఎం ఆదేశాల మేరకు సామూహికంగా జిల్లేడు ద్రావణం తయారు చేశామని యూనిట్ ఇంచార్జి ఉర్లక నాగార్జున తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటకు జిల్లేడు ద్రావణం పిచికారీ చేయడం వల్ల పోటాష్ లోపాలను, సూక్ష్మ పోషకాలు లోపాలను, రసం పీల్చే పురుగులు నివారణకు, చీడపీడలను నివారిస్తుందని అన్నారు. ఈ జిల్లేడు ద్రావణం తయారీ కావలసినవి 180లీటర్లు నీరు, 20కేజీలు జిల్లేడు ఆకులు, 20లీటర్లు దేశి ఆవు మూత్రం, ఈ పదార్థాలు అన్నీ ఒక డ్రమ్ములో వేసి, మూడు రోజులు మురగబెట్టాలని, మూడవ రోజుకి ద్రావణం తయారవుతుందని, ఈ తయారైన ద్రావణం 100 లీటర్లు నీటిలో, పది లీటర్లు ద్రావణం కలుపుకుని పిచికారీ చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ గద్దె ధనబాబు, ఐసీఆర్పీ దీసరి వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

సిపిఎం, రైతుల పోరాట ఫలితంగా విఆర్ఎస్ కాలువలు మరమ్మతులు

విశాలాంధ్ర-మక్కువ : మండలంలో సెప్టెంబర్ 19వ తేదీన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కోల్లి గంగనాయుడు ఆధ్వర్యంలో తూరుమామిడి రైతులు వెంగళరావుసాగర్ ప్రాజెక్ట్ ఆర్.బి.సి.లో19ఎల్ కాలువ మరమ్మతులు పనులు చేయాలని అలాగే వెంగళ రాయ సాగర్‌లో గల ఆర్బిసి, ఎల్బిసి పరిధిలో చివర ఆయికట్టుకు నీరందించాలని తూరుమామిడి పరిధిలో 19ఎల్ కాలువను పరిశీలించి నిరసన తెలియజేశారు దీనికి స్పందించి వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు అధికారులు సెప్టెంబర్ 24వ తేదీన యంత్రాలతో కొండంబుచ్చంపేట నుండి 19ఎల్ కాలువను శాంతేస్వరం పక్కివాని చెరువు వరకు బాగు చేయడం జరిగింది. దీనిని మేము అభినందిస్తున్నా మని ఇలాగే అన్ని వెంగలరాయ సాగర్ ప్రాజెక్టు పరిదిలో గల కాలువలు అన్ని మరమ్మతులుచేసి చివరి ఆయికట్టు వరకు నీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సంఘీభావం తెలియజేసిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర-మోతుగూడెం : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న నిరాహార దీక్షకు మోతుగూడెం మరియు చింతూరు టిడిపి నాయకులు సంఘీభావం తెలియజేశారు. కార్మికుల సమస్యను చింతూరు తెలుగుదేశం పార్టీ నుంచి తీర్మానం చేసి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మరియు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల టిడిపి సీనియర్ నాయకులు ఎండి జహంగీర్,ఎస్ కే జానీ,మస్తాన్ వలి, చల్లా వెంకటేశ్వర్లు, మోతుగూడెం ఎంపీటీసీ వేగి నారేశ్వరరావు,పాసి రమణ, శ్రీను,దొడ్డి ఏసు, దారబాబు, ఊలయ్య, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి ఐటీడీఏ పిఓకు ఎంపీపీ వినతి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలో ఇటీవల శబరి గోదావరి వరదల కారణంగా చింతరేవుపల్లి మీదుగా ఉన్నటువంటి విద్యుత్తు లైను పూర్తిగా నాలుగు నెలల కాలం నుండి వరద నీటితో మునిగి ఉండటం వల్ల త్రీఫేస్ విద్యుత్ సౌకర్యము లేకపోవడం వలన సున్నవారిగూడెం , వెంకన్నగూడెం ,రామవరం, చొప్పల్లి గ్రామాలకు మంచినీటి సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని సత్వరమే పెద్దమట్టపల్లి నుండి సున్నంవారిగూడెం మీదుగా చొప్పల్లి వరకు వరద ముంపు లేని విధంగా త్రీఫేస్ విద్యుత్ లైను ఏర్పాటు చేయాలని కోరుతూ చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వారికి బుధవారం ఎంపీపీ కారం లక్ష్మి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. త్రీఫేస్ విద్యుత్ లైన్ లేకపోవడం వలన సున్నంవారిగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అలానే సోముల గూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు నీటి ఇబ్బందితో పాటు పై గ్రామాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ పులి సంతోష్ కుమార్, కారం సుందరయ్య, పొడియం శ్రీరామమూర్తి, సోడి మల్లయ్య, కుంజా కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాయనాల కన్నా... కషాయాలే మిన్న

వ్యవసాయ అధికారి తిరుపతిరావు

విశాలాంధ్ర-పాచిపెంట : తినే తిండి ఆరోగ్యవంతమైనదిగా ఉండాలంటే పంటలను కూడా ఆరోగ్యవంతంగా పండించాలని పంటలు ఆరోగ్యంగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు . మండలంలో గలవిశ్వనాధపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రకృతి సేద్య పద్ధతులలో పండిస్తున్న కూరగాయల పంటల నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా యువ రైతు హర్షద్ పండిస్తున్న చిక్కుడు బీర వంగ మిరప పండ్ల తోటల నమూన రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు .రైతు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎలాంటి పురుగుమందులు తెగులు మందులు వాడలేదని కేవలం జీవామృతాలు కషాయాలతోనే సాగు చేస్తున్నానని తెలిపారు. అనంతరం ఐ సి ఆర్ పి కుమార్ ఆధ్వర్యంలో ద్రవ జీవామృతం మరియు జిల్లేడు ద్రావణం తయారు చేయించడం జరిగింది. రైతులు కనీసం తినే తిండి గింజల వరకు అయినా సరే అతి చిన్న మొత్తంలో ప్రకృతి సేద్యం కొనసాగించాలని నేల పంట మానవాళి ఆరోగ్యం అంతా ప్రకృతి సేద్యం పైనే ఆధారపడి ఉందని వ్యవసాయ అధికారి కోరారు. రైతులందరూ అన్ని పంటలను నెలాఖరులోగా ఈ పంటలో నమోదు చేసుకోవాలని కోరారు . కొనుగోలు కేంద్రాలకు తరలించినప్పుడు తప్పనిసరిగా ఈ పంట ఐడి ఉండాలని కాబట్టి రైతులు రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.

మెట్టుగూడ జలపాతాన్ని మరింత అభివృద్ధి చేయాలి

జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్‌రెడ్డి

విశాలాంధ్ర-సీతంపేట: మెట్టుగూడ జలపాతాన్ని మరింత అభివృద్ధి చేయుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జలపాతం సందర్శనకు విచ్చేసే పర్యాటకులు ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీటి సదుపాయం, సెల్ఫీ పాయింట్ ను ఏర్పాటుచేయాలని సూచించారు. జలపాతం పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉండాలని, ఎటుచూసిన పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం కనిపించాలని తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం సీతంపేట మండలంలోని మెట్టుగూడ జలపాతాన్ని కలెక్టర్ సందర్శించారు. మెట్టుగూడ జలపాతం పర్యాటకంగా మంచి ప్రదేశం అని అన్నారు. మంచి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పర్యాటక ప్రాంతాలు అందిస్తాయని కలెక్టర్ చెప్పారు. సీతంపేట చుట్టుపక్కల ప్రకృతి సోయగాలతో కూడిన సుందరమైన జలపాతాలు ఉన్నాయని, వీటిని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం ఉన్న వసతులతో పాటు మరిన్ని సదుపాయాలు కల్పించడం ద్వారా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అనంతరం మెట్టుగూడ వద్ద గల పీఎం జన్ మాన్ కింద నిర్మితమవుతున్న గృహాలను కలెక్టర్ తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన త్వరగా గృహ నిర్మాణాలను పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

మండల పరిషత్, గ్రామ సచివాలయాల్లో సమస్యలు పరిష్కార వేదిక

ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి

విశాలాంధ్ర-కురుపాం : ప్రతీ గురువారం మండల పరిషత్ కార్యాలయం ,ప్రతీ గ్రామ సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ,జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తెలిపారు. ప్రజలు తమ సమస్యలు అర్జీలను గ్రామ సచివాలయంలో ఇచ్చి పరిష్కారం చేసుకోవాలని, మండల స్థాయి సమస్యలు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలు కోసం మాత్రమే కలెక్టర్ పిజిఆర్ఎస్ కు వెళ్ళాలని సూచించారు.

ఓణి రహదారిపై చెత్త వేయడం ఆపండి

- మా గ్రామాల ప్రజలు ఆరోగ్యం కాపాడండి...
- వైస్ ఎంపీపీ కనపాక సూర్య ప్రకాశరావు

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ డివిజన్ కేంద్రం నుండి ఓణి, జగనన్న కాలనీకు వెళ్ళే మార్గంలో, బత్తులవాని చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా డంపింగ్ యార్డుగా మార్చారు. అలాగే పాలకొండ నుంచి ఓణి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై చెత్త వేసి రాకపోకులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారు. దానివల్ల వచ్చే దుర్వాసన వల్ల చుట్టుప్రక్కన ఉన్న గ్రామాలు లుంబూరు, గరుగుబిల్లి, ఓణి,గుడివాడ, దెప్పిగూడ, కొత్తవూరు,పులి గుమ్మి మరియు సీతంపేటలో చాలా గ్రామాల ప్రజలు తీవ్రం ఇబ్బందులు పడుతున్నారని, వైస్ ఎంపీపీ కానపాక సూర్య ప్రకాష్ పేర్కొన్నారు బుధవారం మోని రహదారిపై ఉన్న కొండల పేరుకుపోయిన చెత్త కుప్పల వద్ద నిరసన తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల ప్రజల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని కుక్కలు ఎక్కువగా అక్కడికి చేరి రోడ్లుపై నడిచి, సైకిళ్లపై వెళ్ళే విద్యార్థులు, వృద్ధులను భయాందోళన చేస్తూ తిరుగుతూ ఉన్నాయి. విద్యార్థినిలు, విద్యార్థులు స్కూలుకు వెళ్లడానికి కూడా భయపడుతున్నారు. అలాగే జగనన్న కాలనీ వాసులు కూడా దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇది వరకే నగర పంచాయతీ కమిషనర్ వారిని స్వయంగా వెళ్ళి విన్నవించామని కానీ స్పందన లేదు. చెత్త వేయడం ఆపకపోతే తీవ్ర స్థాయిలో చుట్టూ ప్రక్కన ఉన్న గ్రామాల ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని వైస్ ఎంపీపీ కనపాక సూర్య ప్రకాశరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్, రైతులు నెల్లి నాగభూషణ రావు,జనార్ధన, టి.సింహాచలం, పాలకొండకి చెందిన రైతులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా ఐటిడిఏ పార్కును తీర్చిదిద్దాలి

జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్రే-పార్వతీపురం : పర్యాటకులను ఆకర్షించేలా ఐటిడిఏ పార్కును తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్ మరియు ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి ప్రతిపాదనలను సమర్పించా లన్నారు. పార్కుకి వచ్చే పర్యాటకులకు కనులవిందుగా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పార్కులో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, ఎల్లపుడు పచ్చదనం, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పార్కు నిర్వహణ బాగుండాలని, మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలని సూచించారు. పార్కు మరింత అందంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని పేర్కొన్నారు. సుంకిలోని ఐటిడిఏ పార్కును జేసీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులతో ఆయన మాట్లాడుతూ పార్కుకు వచ్చే పర్యాటకులను ఆకర్షించేలా ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేయాలని, పార్కులో ఉండే వసతులు, సదుపాయాలపై ప్రధాన ద్వారంవద్ద, లోపల భాగంలో బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. పర్యాటకంగా ఆకర్షించేందుకు బోటింగ్ తో పాటు ఇతర సదుపాయాలను కల్పించాలన్నారు. పార్కుకొండపై గేటును ఏర్పాటు చేయాలన్నారు. పార్కు వృద్ధికి ఏమి అవసరమో వాటాన్నింటిని సమకూర్చాలని, ఇందుకు అవసరమయ్యే అంచనాలతో ప్రతిపాదనలు త్వరగా సమర్పించాలని జేసీ ఆదేశించారు. ఈపర్యటనలో ఏపీఓ ఏ.మురళీధర్, సహాయ ఇంజినీర్ తిరుపతిరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు

- జడ్పీటిసి నిధులతో సి సి రోడ్లు, డ్రైనేజీలు, భవనాల మరమ్మతు పనులు
- జడ్పీటిసిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తి
- అభివృద్ధికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు
- చింతపల్లి జెడ్‌పిటిసి సభ్యుడు బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : గడచిన నాలుగేళ్లలో వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాలకు గాను సుమారు మూడు కోట్ల రూపాయలకు పైగా నిధులు వెచ్చించి, మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని స్థానిక జడ్పీటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నా రు. ఈ మేరకు చింతపల్లి జడ్పీటిసి గా బాధ్యతలు చేపట్టి నేటితో (బుధవారం) నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జడ్పీటిసి గా తాను బాధ్యతలు చేపట్టి నాలుగేళు పూర్తయిందన్నారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు జిల్లా పరిషత్ నిధులతో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమన్నారు. మండలంలోని 17 పంచాయతీ లకు గాను 15 పంచాయతీ లలో సుమారు మూడు కోట్ల రూపాయలకు పైగా నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనుల ద్వారా నిర్మాణాలు చేపట్టామన్నారు.ఇందులో భాగంగా 15 పంచాయతీలలోని గ్రామాల్లో సుమారు 40 బోరు బావులు నిర్మాణాలతో పాటు, సిమెంటు రహదారుల, మురుగు కాలువల నిర్మాణాలు, కల్వర్టుల ఏర్పాటు, అంగన్వాడీ కేంద్ర భవనాల మరమ్మత్తులు ఉన్నాయన్నారు. అంతేకాకుండా చింతపల్లి ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య పరిష్కారం నిమిత్తము చింతపల్లి గ్రామంలోని సాయినగర్ లో సుమారు 10 లక్షల రూపాయల నిధులు వెచ్చించి తాగు నీటి పథకం, (ప్రాజెక్టు), నిర్మా ణం చేపట్టినట్లు చెప్పారు. అదే క్రమంలో స్థానిక జిల్లా పరిషత్ అతిథి అతిథి గృహానికి సిమెంటు రహదారి నిర్మాణానికి 10 లక్షల రూపాయల నిధులు కేటాయించా మన్నారు. చింతపల్లి గ్రామంలో రెండు, అన్నవరం గ్రామంలో ఒకటి, పెదబరడ పంచాయతీలో రెండు అంగన్వాడి భవనాల మరమ్మత్తుల పనులు చేపట్టామన్నారు. పెదబరడ పంచాయతీలోని సిరిపురం, చింతలూరు కృష్ణాపురం గ్రామాల్లో త్రాగునీటి పథకాల నిర్మాణాలు చేపట్టామన్నారు. మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయ మరమ్మతలకు గాను సుమారు పది లక్షల రూపాయలు నిధులు వెచ్చించామన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాలుగు లక్షలతో మరమ్మత్తులు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి సుమారు రెండు లక్షల 70 వేల రూపాయలు నిధులు కేటాయించామన్నారు. ఎర్రబొమ్మల పంచాయతీ కొండవంచుల, కిటుముల పంచాయతీ లోని దేవరపల్లి, తాజంగి పంచాయతీలోని బూడిదపాడు, గ్రామాలలో త్రాగు నీటి పథకం నిర్మాణానికి, ఒక్కొక్క పథకానికి రెండు లక్షల 70 వేల రూపాయలు నిధులు వెచ్చించామన్నారు కొత్తపాలెం పంచాయతీలోని మామిడిపల్లి, బురిసింగి గ్రామాల్లోని మురుగు కాలువల నిర్మాణాలకు గాను ఒక్కొక్కదానికి 5 లక్షల చొప్పున నిధులు వెచ్చించామన్నారు. అదేవిధంగా సూది మెట్ట గ్రామంలో పది లక్షల రూపాయల నిధులతో సిమెంటు రహదారులు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో 5 లక్షల రూపాయల నిధుల తో సిమెంటు రహదారులు నిర్మించామన్నారు. మండల కేంద్రంలోని గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో పది లక్షల రూపాయల నిధులు కేటాయించి స్టేజి/రచ్చబండ నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. అంతే కాకుండా తాను ఎంపీపీ కోరాబు అనూష దేవి కలసి ఎంపీ నిధుల నుంచి మండల కేంద్రంలో కళ్యాణ మండపం నిర్మాణానికి గాను 40 లక్షల రూపాయలు నిధులు మంజూరుకు కృషి చేశామన్నారు. మండలంలోని 17 పంచాయతీ లకు గాను 15 పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ, బలవం, అంజలిశనివారం పంచాయతీ లలో అభివృద్ధి పనులు చేపట్టలేక పోయానన్నారు. రానున్న ఏడాది కాలంలో ఆ రెండు పంచాయతీ లలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి కృషి చేస్తామన్నారు. మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పదంలో నాలుగేళ్లు విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా తనకు సహకరించిన స్థానిక/జిల్లా పరిషత్ ఉన్నతాధికారులకు, సహచర ప్రజా ప్రతినిధులకు (జడ్పీటిసిలు, ఎంపిటిసి), సర్పంచ్‌లకు, అన్ని శాఖల అధికారులకు ప్రజలకు ఈ సందర్భంగా పత్రికా ముఖంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యరాస మంగమ్మ అకాల మరణం

విశాలాంధ్ర.జి.మాడుగుల : మండలం స్థానిక జి. మాడుగుల రామాలయం వీధిలో బుధవారం పాడేరు మాజీ వ్యవసాయ శాఖ మార్కెటింగ్ చైర్మన్ మత్స్యరాస గాయిత్రిదేవి జి.మాడుగుల ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి అత్త మాజీ రాష్ట్ర వైస్సార్ టిఫ్ యూనియన్ సెక్రటరీ మత్స్యరాస మత్స్యరాజు మాతృమూర్తి మత్స్యరాస మంగమ్మ అకాల మరణంనికి వైసీపీ రాష్ట్ర ఎస్టీ సేల్ అధ్యక్షురాలు పాడేరు మాజీ శాసన సభ్యురాలు కొట్టాగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతు అత్త అయినటువంటి మత్స్య రాస మంగమ్మ మరణం ఎన్నడూ మరువలేనిదని ఆమె పవిత్రమైన ఆత్మకు శాంతిలి చేకూరాలని వారి కుటుంబానికి పరామర్శిస్తూ సంతాప ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, పాడేరు జిల్లా హాస్పిటల్ వైస్ సూపరడెంట్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ సబ్ డివిజన్‌లో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- నగరపాలక సంస్థ, పిఎంజన్ మాన్ గృహాలు ఆకస్మిక తనిఖీ
- అడలి వ్యూ పాయింట్, ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులు సందర్శన
- గిరిజనులు ఆరోగ్యంపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర-పార్వతీపురం/పాలకొండ/సీతమ్మపేట : జిల్లాలో అత్యంత ప్రసిద్ధిగాంచిన పాలకొండలోగల శ్రీకోటదుర్గమ్మ అమ్మవారిని కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మంగళవారం దర్శించుకుని జిల్లా ప్రజలకు మంచి జరగాలని మొక్కినట్లు తెలిపారు. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్‌తో పాటు పాలకొండ సబ్ కలెక్టర్, సీతమ్మపేట ఐటిడిఏ ఇంచార్జి పిఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ కూడా ఆయన వెంట పాల్గొన్నారు. ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి, భక్తులతో మమేకమై ఏర్పాట్లపట్ల భక్తులను అడిగి అన్ని అన్ని వివరాలు తెలుసుకున్నారు. నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం, లోటుపాట్లు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆలయ కమిటీకి తగు సూచనలు జారీచేశారు. అనంతరం పాలకొండలో అన్నా క్యాంటీన్‌ను కూడా సందర్శించారు. నగర పంచాయతీ కార్యాలయాన్ని కూడా సందర్శించి ఉద్యోగులతో సమీక్షించారు. పాలకొండ మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన పట్టణాభివృద్ధికి అవసరమైన టౌన్ యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. మునిసిపల్ పరిధిలో ఉండే చెరువులను అభివృద్ధి చేయాలని, చెరువుల చుట్టూ మొక్కలను నాటి సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం వలన పాదచారులు ఎక్కువగా ఉపయోగ ముంటుందన్నారు. అడాలి వ్యూ పాయింట్ సందర్శన: జిల్లాలో సుందరమైన, పర్యాటకులను ఆకర్షిస్తున్న సీతంపేట ఐటిడిఏ పరిధిలో గల అడాలి వ్యూ పాయింట్ ను జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి సబ్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అత్యుత్తమ పర్యాటక ప్రదేశాల్లో ఇదిఒకటని, జిల్లా యంత్రాంగం మంచిపర్యాటక కేంద్రంగా గుర్తించి కొన్నిసౌకర్యాలు కల్పించిందన్నారు. అయితే ప్రకృతి సిద్ధంగా ఉండి, ఆహ్లాదకర వాతావరణంలో ఉండే ఈ వ్యూ పాయింట్‌లో కాంక్రీటుతో కట్టిన కట్టడాలుకన్నా వెదురుతో చేసిన కట్టడాల వలన సహజసిద్ధంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయడం వలన విశేషంగా పర్యాటకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధంచేసి వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సీతంపేటలో గల ఎన్.టి.ఆర్ అడ్వెంచర్ పార్కును సందర్శించి, అధికారులకు దీనిని అభివృద్ధి చేసేందుకు పలు సూచనలు చేశారు. పర్యాటక సీజను ప్రారంభం నాటికి ఎన్.టి.ఆర్ అడ్వెంచర్ పార్కును సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. పార్కు అభివృద్ధి కొరకు సూచించిన పనులన్నీ అక్టోబర్ మొదటి వారానికి పూర్తి కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సుందరమైన, వినోద భరితమైన ప్రదేశాల్లో ఎస్.టి.ఆర్ పార్క్ ఒకటని, దీన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పార్కుకు విచ్చేసే పర్యాటకులకు పచ్చదనం, పరిశుభ్రంతో మంచి ఆహ్లాదకర వాతావరణం కనిపించాలన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలని, గిరిజన యువత వివిధ రకాల షాపులను నిర్వహించుకునేలా అనుమతి ఇవ్వాలని, తద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటకుల అవసరాలు తీరుతాయని కలెక్టర్ వివరించారు. ఇంతటి ప్రాముఖ్యత గల పార్కును మరింత శోభాయ మానంగా తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ అధికారులను ఆదేశించారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు కనువిందు చేసేలా ప్రధాన ముఖద్వారం అద్భుతంగా కనిపించాలని, వెదురుతో సహజ సిద్ధంగా ఉండేలా ఆర్చ్ ఉండాలని కలెక్టర్ సూచించారు. ఫొటో

షూటింగులకు ఈపార్కు అనుకూలమని, అందుకు తగిన విధంగా సుందరమైన కట్టడాలను ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే సెల్ఫీలు తీసుకునేలా సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఇక్కడకు వచ్చే పర్యాటకుల కొరకు అందమైన సిట్టింగ్ ఏరియా, పార్కులో ఎటుచూసినా అందంగా కనిపించేలా అద్భుతమైన పెయింటింగ్స్ కనిపించాలన్నారు. సుదూర ప్రాంతాల

నుంచి వచ్చే పర్యాటకుల కొరకు అవసరమైన అన్ని వస్తువులు ఇక్కడ లభించాలని, అలాగే కేఫిటేరియా, తినుబండారాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలికవసతులు ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేసారు. పర్యాటకుల వినోదం కొరకు నిర్మించిన 3డి, 5డిథియేటర్లతో పాటు పార్కు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచడం వలన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని కలెక్టర్ వివరించారు. అనంతరం సీతంపేట మండలంలోని మెట్టుగూడవద్ద నిర్మిస్తున్న పీఎం జన్‌మాన్ గృహాలను తనిఖీ చేసి, అధికారులకు తగు సూచనలు, మార్గదర్శకాలను జారీచేసి పూర్తిచేసే చర్యలు చేపట్టాలన్నారు.

పర్యాటకులకు 50 పీవిటీజీ హెూమ్ స్టేలు ఏర్పాటు చేయాలి : సీతంపేట ఐటిడిఏ పరిధిలో వచ్చే పర్యాటకుల కొరకు 50 పీవిటీజీ హెూమ్ స్టేలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా అడాలి వ్యూపాయింట్ సందర్శన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. సీతంపేట చుట్టుపక్కల సుందరమైన ప్రదేశాలు ఉన్నాయని, అయితే వచ్చే పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అవసరమైన వసతులు లేవని అన్నారు. ఇందుకోసం ఈ ఏడాది ఐటిడిఏ ద్వారా వ్యూ పాయింట్స్, జలపాతాలు చుట్టుపక్కల 50 పీవిటిజి హెూమ్ స్టేలను నిర్మించేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు స్థానిక యువతకు రుణాలు మంజూరుచేయాలని, పర్యాటకుల కొరకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సీతమ్మపేటలో విడివికే కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ గిరిజనులు ఉత్పత్తులు చేస్తున్న కొండ చీపుర్లను పరిశీలించి, వాటిగూర్చి ఆరా తీశారు. ఈకేంద్రాల ద్వారా జరుగుతున్న ఉత్పత్తులు, మహిళల ఆర్థిక స్వావలంబన గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట సీతమ్మపేట ఐటిడిఏ అధికారులు, పాలకొండ రెవిన్యూ డివిజన్ అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ గా గతశనివారం బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఆర్ ప్రభాకర్ రెడ్డి తనదైన శైలిలో అన్నివర్గాలలో ప్రత్యేకతను సాధించుకోవడానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువ కావడానికి కావలసిన విదానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి సారించారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు అందజేయడానికి గిరిజనులు వారు పండించే పంటలను అమ్మే స్థలము, వారికి కావలసిన నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసే స్థలమైన సంతల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వారిలో ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ఉన్న ఐఏఎస్ ఆఫీసర్లను 4నియోజకవర్గ స్థాయిలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆయన మొదటిసారిగా సోమవారం నాడు జిల్లాలో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున గ్రీవెన్స్ దారులు రావడాన్ని గమనించి గ్రామస్థాయిలో, మండల స్థాయిలో వారి సమస్యలు నేరుగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించి అక్కడ పి జి ఆర్ ఎస్ నిర్వహించేందుకు నడుము కట్టారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో రాత్రిపూట మండల కేంద్రాల్లో బసచేసే విధానాన్ని కూడా ప్రారంభించారు. ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తెలియజేసిన అన్ని అంశాలను జిల్లాలో అమలు చేయడానికి జిల్లా అధికార యంత్రాంగానికి ఎప్పటికప్పుడు తగుసూచనలు చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చెరువు కావడానికి తనదైన కృషి చేస్తున్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి

ఎంపీపీ అనూష దేవి

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్ లు అవగాహన పెంచుకొని, ఆ లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. రెండు రోజుల శిక్షణ తరగతులు కార్యక్రమంలో భాగంగా తొలిరోజు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం ఆఫ్ లోకలైజేషన్ (సుస్థిరాభివృద్ధి) లక్ష్యాలపై 2025-2026 ఏడాదికి గాను చింతపల్లి, జీకే విధి మండలాలకు చెందిన సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులకు వార్షిక ప్రణాళిక పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతపల్లి, గూడెం కొత్త వీధి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి చింతపల్లి జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య లు ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా చింతపల్లి ఎంపీపీ అనూష దేవి మాట్లాడుతూ ఆర్ జి ఎస్ ఏ వార్షిక ప్రణాళిక 2025 - 26 ఏడాదికి గాను సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించుతున్న ఈ శిక్షణా తరగతులపై అవగాహన పెంచు కోవాలని కోరారు. నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను, విజయవంతంగా పూర్తి చేసేందుకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల్లోని సర్పంచులు, కార్యదర్శులతోపాటు చింతపల్లి మండల పరిషత్ సీనియర్ సహాయకులు ఎన్టీరామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జడ్పిటిసి, ఎంపీటీసీలు

- అందరి సహకారంతో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టాం
- చేపట్టిన అభివృద్ధి పనులు సంతృప్తినిచ్చాయి
- ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా ఎన్నికై నేటితో నాలుగేళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. బుధవారం ఎంపీపీ చాంబర్ లో జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, వైకాపా నాయకులతో కలసి పదవి చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా వారు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలందరి సహకారంతో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం, చాలా వరకు పూర్తి చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంలోనూ, పూర్తి చేయడంలోనూ తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు వనగల బెన్నిబాబు, వనపల రాజేష్, గెమ్మెల సింహాచలం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తుందిలో పంటలపై రైతులకు సూచనలు, మెలకువలు

మండల వ్యవసాయ అధికారి డి.గిరిబాబు

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలం గూడెం కొత్త వీధి రైతు సేవా కేంద్రం పరిధి బొడ్డుమానుపాకలు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగిందినీ మండల వ్యవసాయ అధికారి డి గిరిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా వరి, పసుపు, రాజ్మా పంటలను సందర్శించి పరిశీలించుట జరిగింది. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిలో ఆకు ముడత పురుగు ఎక్కువగా వున్నదనీ, పోటాష్ లోపం అక్కడక్కడా కనిపిస్తుంది. ఆకు ముడత నివారణకు క్లోరిపైరిఫస్ 500 ఎంఐ /1ఎకరానికి పిచికారీ చేసుకోవాలినీ ఆయన సూచించారు. అలాగే పోటాషియం లోపం నివారణకు ఎకరానికి 15-20 కేజీలు ఏంఓపీ వేసుకోవాలన్నారు. రాజ్మా 2 వారాల వయసు ఉండగా, రాజ్మా పంటకు రసం పీల్చే పురుగు ఆశించకుండా వేప నూనె ఒక లీటర్ ఎకరానికి పిచికారీ చెయ్యాలని రైతులకు ఆయన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.గిరిబాబు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. డి.వెంకటేష్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెదవలసలో దేవీ నవరాత్రులు

విశాలాంధ్ర-జీకే విధి : గూడెం కొత్త వీధి మండలం పెదవలస గ్రామంలో శ్రీ దుర్గా మల్లేశ్వరి శ్రీ దుర్గాదేవి శరణ్య నవరాత్రులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడవ రోజున ఉదయం నుండే అమ్మవారి సన్నిధికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నవరాత్రులు పూజలు చేసుకుని అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. శుక్రవారం 26 న ఆలయ కమిటీ దాతల సహకారంతో మహా అన్న సమరాదన కార్యక్రమం నిర్వహించబడుతుందని, భక్తులు విచ్చేసి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించవలసిందిగా ఆలయ కమిటీ సభ్యులు కంకిపాటి గిరిబాబు కోరారు.

అన్నపూర్ణాదేవిగా కోట దుర్గమ్మ

విశాలాంధ్ర-వీరఘట్టం : వీరఘట్టం మండలం ఇలవేల్పు కోట దుర్గమ్మవారు నవరాత్రుల్లో మూడవ రోజు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు.

26న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-ఎటపాక : ఈనెల 26 న సర్వసభ్య సమావేశం ఎటపాక ఎంపీడీవో కార్యాలయం నందు జరుగుతుందని ఎంపిడివో ప్రేమ్ సాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొనాల్సిందిగా కోరారు.

వైద్య శిబిరాన్ని సధ్వినియోగం చేసుకోండి

సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ సందీప్‌కుమార్

విశాలాంధ్ర-కురుపాం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం లో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ద్వారా నేడు నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిభిరంను పరిశర గ్రామాల్లో ప్రజలు సధ్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డా.కె.సందీప్ కుమార్ కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు ఆరోగ్యం పటిష్టంగా ఉండాలనే సంకల్పంతో ఈ వైద్య శిభిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్ని విభాగాల్లో వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రక్తదానం చేసేందుకు యువత రావాలి : వైద్య శిభిరంలో భాగంగా ప్రత్యేక రక్తదాన శిభిరం కూడా నిర్వహిస్తున్నామని యువత రక్త దానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని సూచించారు.

3వ రోజు ఘనంగా దేవీ నవరాత్రులు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లోని, పలుఆలయాల ప్రాంగణాల్లో, పబ్లిక్ స్థలాల్లో దేవీ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తూఘనంగా నిర్వహిస్తున్నారు. దేవీనవరాత్రుల్లో భాగంగా మూడవరోజు బుధవారం శ్రీ అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమపూజతో, కలశాలతో, దీపాలతో భక్తిశ్రద్ధలతో అన్ని భవానీ మాలలు వేసుకుని అన్నిచోట్ల పూజలను చేస్తున్నారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కూడా శరన్నవరాత్రి మహెూత్సవాలు ఆలయ ప్రాంగణంలోగల శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి దగ్గర ప్రతిరోజు ఉదయం కుంకుమ పూజలు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు టీటీడీ పారాయణకర్త శ్రీనివాసరావులు తెలిపారు. మరిపివలసలో కూడా దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అర్చకులు సురేష్, మైలారభట్ల ప్రసాదరావులు తెలిపారు. ఎం ఆర్ ఓ కార్యాలయం ప్రక్కన దేవీ నవరాత్రులు మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో దేవి పూజలను నిర్వహిస్తూ, రాత్రి వేళల్లో భజనలు చేస్తున్నారు. భవాని మాలలు వేసుకుని దసరాపూజలు అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం గమనార్హం.

మా బడిని మాకు అప్పజెప్పండంటూ చినమేరంగిలో విద్యార్థుల నిరసన

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి విద్యార్థులు మా పాఠశాలను మాకు తిరిగి అప్పజెప్పండి అంటూ నిరసన వ్యక్తం చేశారు వివరాలలోకి వెళితే చిన మేరంగిలోగల మండల పరిషత్ (ప్రాథమిక పాఠశాల జేబీ) విద్యార్థులతో గ్రామ మాజీ సర్పంచ్ బత్స సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం ఆ పాఠశాల ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అయితే 2009లో వీరి పాఠశాలను పోలీస్ అవుట్ పోస్ట్ గా ఏర్పాటు చేశారు. ఆనాటి నుండి నేటి వరకు వీరి చదువులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చినమేరంగి పాత భవనంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (జేబీ) పేరుతో కొనసాగుతూ వస్తుంది ప్రస్తుతం వీరు చదువుతున్న పాఠశాల పాత భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి ఎప్పుడు ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మార్చి 2024 వరకు పోలీస్ స్టేషన్‌గా కొనసాగిన పాఠశాల భవనం ప్రస్తుతం ఖాళీగానే ఉంది దీనితో పాఠశాల భవనం మాకు అప్పగించండి అంటూ అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆ గ్రామంలో ఉన్న పోలీస్‌స్టేషన్ ఆశ్రయించి దరఖాస్తు చేసుకున్నారు కూడా కానీ పాఠశాలను విద్యాశాఖకు అప్పగించాలంటే చేయాల్సిన పనులు పోలీస్ శాఖ ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేసిన వారి నుండి స్పందనే కరువైందని వాపోతున్నారు కాగా ప్రస్తుతం దసరా సెలవులు తర్వాత అయినా తమకు అప్పగించి మా విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడాలని దీనికి జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి స్పందించాలని గ్రామ మాజీ సర్పంచ్ బొత్స సూర్య ప్రకాష్ విద్యార్థులు విద్యార్థులయొక్క తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు.

సేవా కార్యక్రమాలతో ఎంతో సంతృప్తి

కుమారుని పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవలో డాక్టర్ జగన్‌మోహన్

విశాలాంధ్ర-బెలగాం : ప్రతీ ఒక్కరూ తమ అవకాశం మేరకు సామాజిక సేవ చేయాలని జిల్లా ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు కోరారు. తన కుమారుని పుట్టినరోజు సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో గల బాలల సత్వర చికిత్సా కేంద్రంలో, పోషకాహార పునరావాస కేంద్రాల్లో బుధవారం సాయంత్రం ఆయన సేవా కార్యక్రమం చేపట్టారు. ఎన్.ఆర్.సిలో స్టీల్ కంచాలు, స్పూన్స్, పిల్లల ఆట వస్తువులు అక్కడ నిర్వాహక వైద్య సిబ్బందికి అందజేసి పిల్లలకు పండ్లు అందజేశారు. డిఇఐసిలో కొన్ని నెలల పాటు వాటర్ కేన్లతో మినరల్ వాటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా. జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతీ ఏటా పలు ప్రత్యేక సందర్భాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మనం అందించే ఏ చిన్న సాయమైనా ఎంతో కొంత ఉపయోగపడుతుందని, ప్రతీ ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని తద్వారా ఎంతో మానసిక సంతృప్తి కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం అక్కడ పిల్లల ఆరోగ్య వివరాలు అడిగి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఐసి పిల్లల వైద్యులు డాక్టర్ ఎల్. భరత్ చంద్ర, న్యూట్రిషన్ కౌన్సిలర్ జ్యోతి, డెమో సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్. ఎస్.ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పాలకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురులో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది ఎన్ ఎస్ ఎస ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు వేమూరు హరగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ సేవా పథకం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది.. మహాత్మా గాంధీ శతజయంతి ఉత్సవాలలో భాగంగా జాతీయ సేవా పథకం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ పథకం మొదట కేవలం యూనివర్సిటీ విద్యార్థులకు మాత్రమే పరిమితమై ఉండేదని నేడు డిగ్రీ కళాశాలలో మరియు జూనియర్ కళాశాలలో కూడా ఈ జాతీయ సేవా పథకం విస్తరించడం జరిగిందని తెలియజేశారు.. ఈ పథకం ముఖ్య ఉద్దేశం "నాకోసం కాదు మీకోసం" అనే భావనతో ప్రతి ఒక్కరు ఉండాలని, క్రమశిక్షణ, ఇతరుల పట్ల సేవా భావం ఉండాలని తెలియజేశారు. కళాశాల సీనియర్ అద్యాపకులు పైల శంకర్రావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో విద్యార్థులు చేరడం వారి అదృష్టం గా భావించాలని కళాశాలలో సుమారు 600 మంది విద్యార్థులు ఉంటే వారిలో కేవలం 100 మందికి మాత్రమే ఈ పథకంలో చేరే అవకాశం ఉంటుందని అలాగే వారిలో 50 మందికి మాత్రమే ప్రత్యేక సేవా శిబిరాలలో పాల్గొనే అవకాశం ఉంటుందని కావున దానిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి వారిలో విజేతలకు ప్రిన్సిపాల్ హరగోపాల్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరామమూర్తి, విజయరాజ్, నారాయణరావు, రవిశంకర్ పాల్గొన్నారు.

నాటుసారా, మద్యం ధ్వంసం

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పార్వతీపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ సంతోష్ ఆధ్వర్యంలో సీతానగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ డి.పద్మావతి, సిబ్బంది పట్టుకున్న 4వందల లీటర్ల నాటుసారాయిని, వివిధ కేసులలో పట్టుబడిన 17లీటర్ల అక్రమ మద్యంను ధ్వంసం చేయటం జరిగినట్లు సిఐ పద్మావతి తెలిపారు. ఈకార్యక్రమంలో సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం 4గంటలకు సీతానగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసులో సీజ్ చేయబడిన ఒక ద్విచక్ర వాహనంను వేలం వేయనున్నట్లు సిఐ పద్మావతి తెలిపారు. వేలంను పార్వతిపురంలో వేయడం జరుగుతుందన్నారు.

భక్తులు ఆధ్వర్యంలో దుర్గమ్మతల్లికి తాళిబొట్టు

దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గమ్మతల్లికి వెండి పుస్తెలతాడును బహూకరించిన భక్తులు

విశాలాంధ్ర-జి.మాడుగుల : జి మాడుగుల మండల కేంద్రంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గమ్మతల్లికి జి.మాడుగులలో ఉంటున్న భక్తులు సహాయార్థంతో వెండి పుస్తెలతాడును చేయించి వేదమంత్రాలతో గురు భవానిలు భవానీల శరణు ఘోషలతో దుర్గమ్మ తల్లికి బుధవారం అలంకరించారు. ఈ పుస్తెలతాడును ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలకు దుర్గమ్మ తల్లికి అలంకరించి విజయదశమి రోజున అమ్మవారిని నిమజ్జనం అయిపోయిన తర్వాత తీసివేసి మరలా వచ్చే ఏడాది అమ్మవారి అలంకరణ చేస్తామని మహిళా భక్తులు తెలిపారు. గత ఏడాది అమ్మవారికి వెండి తాళిబొట్టును ఏర్పాటు చేశామని ఈ ఏడాది వెండి పుస్తెలు తాడును సుమారు 60 వేల రూపాయలతో భక్తులు సహాయంతో చేయించామని తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తులు సహాయార్థంతో అమ్మవారికి దసరా ఉత్సవాలలో భాగంగా పూజలు నిమిత్తం అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు భవానీలు పాల్గొన్నారు.

పంచాయతీ ఆరోపణలపై పారదర్శకంగా విచారిస్తాం : డిఎల్‌పిఓ

విశాలాంధ్ర-కూనవరం : గత కొంతకాలంగా కూనవరం మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, సర్పంచ్ హేమంత్ గాంధీ లపై పలు సంఘాలు చేస్తున్న ఆరోపణల దృష్ట్యా పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా సుమోటాగా తీసుకొని విచారణ చేపట్టినట్ల డిఎల్‌పిఓ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కూనవరం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరోపణల్లో మొదటిది గిరిజనేతర సర్పంచ్ కొనసాగ వచ్చా అనే ప్రశ్నకు సమాధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 1993-94 ప్రకారం ఒక గిరిజన సర్పంచ్ చనిపోయిన తర్వాత ఉపసర్పంచ్ పూర్తి అధికారాలతో ఆబాధ్యతను చేపట్టవచ్చని, ప్రభుత్వం బై ఎలక్షన్ పెట్టేవరకు అదే వ్యక్తి పదవిలో కొనసాగవచ్చు అని పేర్కొన్నారు. ఇక పంచాయతీ నిధుల దుర్వినియోగం బినామీల పేరిట పనులు చేయడం వంటి ఆరోపణలకు సంబంధించి రికార్డులననుసరించి విచారణ చేసి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. అప్పటి వరకు రికార్డులు సీజ్ చేస్తున్నట్లు ఆయన మీడియాతో చెప్పారు.

స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ వైద్యశిబిరం

విశాలాంధ్ర-జి.మాడుగుల : తల్లి బాగుంటేనే కుటుంబమంతా బాగుంటదని అనే కార్యక్రమం ద్వారా బుధవారం కె.కోడాపల్లి సచివాయ పరిధిలో వైద్యాధికారి బి.కిశోర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 98 మందిరి ఓపీ నిర్వహించి 68 మందికి వైద్య సేవలు అందిచినట్లు తెలిపారు. కాగా 40 మందికి సాధారణ ఓపీ పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాతె చిలకమ్మ, సిబ్బంది నడగంట్ల ప్రకాశ్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అప్పులపాలు

తీవ్రస్థాయిలో మండిపడ్డ అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు



విశాలాంధ్ర-పాలకొండ : భారతదేశాన్ని అప్పులు దేశంగా మార్చేసిన ప్రధాని నరేంద్ర మోడీ తీవ్రస్థాయిలో మండిపడ్డ అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 25 లక్షల కోట్లు బహుళ జాతి కంపెనీల అప్పులను రైటాప్ చేశారు. పేదొడికి ఒక న్యాయం-పెద్దొడికి ఒక న్యాయమా? బ్యాంకుల పనితీరు ఖాతాదారుల నుంచి బ్యాంకర్లు, మినిమమ్ బ్యాలెన్సుల పేరున సర్వీసు చార్జీల పేరున డిపాజిట్లు పేరున సర్ చార్జీలు అధికంగావసూలు చేసి ఆదాయం పెంచుకొని బహుళ జాతి కంపెనీ వారికి లక్షలాది రూపాయలు రుణమాఫీలు చేస్తూ ఇటీవల సుబ్బరామిరెడ్డికి 5,700 కోట్లు రుణమాఫీ చేశారని ఎద్దేవా చేశారు. రుణ మాఫీ గూర్చి 2016లో మోదీ చట్టం చేశారు. కాకులను కొట్టి గద్దలకు వేయడం అంటే ఇదే రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రకారం 2 లక్షల వరకు కౌలు రైతులకు ఎటువంటి హామీ లేకుండానే పంట రుణాలివ్వాలన్న ఆదేశాలను రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ తుంగలో తొక్కింది అని మోదీ 11 ఏళ్ల పాలనలో బీజేపీ పార్టీ అభివృద్ధి గూర్చి పేదవాడిని అణగదొక్కి 25 లక్షల కోట్ల రూపాయలను రుణాలను బహుళజాతి కంపెనీ వాళ్లకు మాఫీ చేసిందన్నారు.అందుకు ప్రధాన కారణం వీరు బీజేపీకి ఎన్నికల్లో కోట్లాది రూపాయలు నిధులు అందజేస్తారు.ఇటీవల మన ఆంధ్రలో చాలామంది రుణ వేతదారులకు రుణ మాఫీ చేసి తమ ఔధర్యాన్ని నిరూపించుకున్నారు.ఈ భారాన్ని ఖాతాదారుల నుంచి బ్యాంకర్లు,మినిమమ్ బాలెన్స్ లేకపోతే రూ.500, సకాలంలో రైతులు తీసుకున్న రుణాలు చెల్లించకపోతే 12 శాతంగా ఉన్న వడ్డీ 18 శాతానికి పెంచడం సర్వీసు చార్జీల పేరున అప్పు చేసిన వారిపై భారం వేయడం లక్షలాది రూపాయలు డిపాజిట్ల ద్వారా ఎక్కువ శాతంగా ఉన్న వడ్డీని తక్కువ శాతంగా ఇవ్వడం వంటి నగదుతో బ్యాంకులు ఆదాయాన్ని పెంచుకుంటున్నాయి. 145 కోట్లు జనాభా ఉన్న భారత్‌కు 200 లక్షల కోట్లు అప్పు చేశారు.ఈ అప్పు 5 రాష్ట్రాల బడ్జెట్‌కు సమానం. ఇది ఎవరు చెప్పింది కాదు.పార్లమెంట్ సమావేశంలో ప్రశ్నోత్తర సమయంలో పార్లమెంట్ సభ్యులు ప్రశ్న నంబరు 1832 మంత్రి మల్లిఖార్జున ఖార్గే చెప్పిన సమాధానం గత 10 సంవత్సరాలుగా భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 4వ అతిపెద్ద శక్తిగా అవతరించిందని కేంద్రం ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుంది.ఈ ఆర్థిక వృద్ధి వెనక అప్పుల భారం గణనీయంగా పెరిగిందని కంప్ట్రాలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) తాజాగా నివేదిక వెల్లడిచిందన్నారు.ఈ నివేదిక ప్రకారం రాష్ట్రాల రుణ భారం గత పదేళ్లలో మూడు రెట్లు పెరిగి దేశ ఆర్థిక సుస్థిరతకు పెను సవాళ్లుగామారింది.కాగ్ నివేదికలో ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, కేరళ,బీహార్,తమిళనాడు రాష్ట్రలు తెలంగాణ ఆర్థిక నిబంధనలు ఉల్లంగించాయి.కాగ్ నివేదిక ప్రకారం ఆర్థికంగా ఎదిగినా భారతదేశం అప్పుల భారంతో మునిగిపోతుంది.కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పెరుగుతున్న రూణాలు భవిష్యత్‌లో పెట్టుబడులకు ఆటంకం కలిగించి ఆర్థిక వృద్ధి మందగించి ప్రమాదంలో ఉందని కాగ్ తెలిపింది. ఎన్నికలు ముందు మోదీ విదేశంలో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ప్రతి పౌరుడు ఖాతాలో లక్ష రూపాయలు వేస్తానని వాగ్దానం చేశారు.తీరా ఎన్నికల తరువాత మొండి చేయి చూపించారు.కేంద్రంలో రైతులకు ఉరిలాంటి మూడు నల్ల చట్టాలను తెచ్చారు. దానిపై 400పైగా రైతు సంఘాలు పోరాడగా 450 మంది రైతులు చనిపోయారు. లఖింపూర్ ఖేరీలో నల్ల చట్టాలపై ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ఉప రక్షణ మంత్రి అమిత్ మిశ్రా కొడుకు అశుతోష్ మిశ్రా కారుతో కుమ్మించి నలుగురురైతులను బలిగొన్నారు. భారతకు అవార్డులు తెచ్చిన మహిళా మల్లయోధులను క్రీడా శాఖ మంత్రి బ్రజ్‌భూషన్ ల్కైంగిక వేదింపులకు గురి చేసినా మహిళా మల్లయోధులు విన్నవించినా స్పందించని కేంద్రం అందుకు నిరసనగా వారు తమ అవార్డులను గంగానదిలో నిమజ్జనం చేయడానికి పూనుకోగా ఆలిండియా కిసాన్ సంఘ అధ్యక్షుడు రాకేష్ టికాయల్ వారిని వారించి ఈ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకువెళతానని చెప్పి వారిని సముదాయించారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఎటువంటి హామీ లేకుండానే కౌలు రైతులకు రుణాలివ్వాలని 2018-19 సంవత్సరంలో బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌బిఐ నిబంధనకు వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్లు వ్యవహరిస్తున్నారు. ఈ అసెంబ్లీ సమావేశంలో కౌలు రైతుల సమస్యలను గుర్తించి కౌలు రైతులకు రుణాలు సరఫరా చేసే విధంగా చట్టం తేవాలి రైతుల రుణమాఫీలు చేయాలని డిమాండ్ చేశారు.

వచ్చేది వైకాపా ప్రభుత్వమే

- ప్రజలంతా ఓటుతో కూటమికి బుద్ధి చెబుతారు
- వేధింపులకు గురిచేసిన ఏ ఒక్కరనీ వదిలిపెట్టేది లేదు

విశాలాంధ్ర-సాలూరు : ఎన్నికలు ఎప్పుడు జరిగిన వైసీపీ ని గెలిపించేందుకు ప్రజలంతా ఎదురుచూస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు.బుధవారం పార్టీ కేంద్రకార్యాలయంలో వైకాపా ముఖ్య నాయకులతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న రాజన్నదొర సమావేశ వివరాలను వెల్లడించారు.వైకాపా ప్రభుత్వం హయాంలో అమలైన సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం లో అమలు కాకపోవడంతో ప్రజలంతా కూటమి పాలనపై విసుగుచెంది వైకాపా ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నారన్నారు.ఎన్నికల ముందు అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు ఎన్నికల అనంతరం ప్రజలకు మొండిచేయి చూపాయన్నారు.సూపర్ సిక్స్ అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప ఆడబిడ్డనిధి,నిరుద్యోగ భృతి ఏ ఒక్కరకి అందలేదన్నారు. ఎవరకి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు అదనంగా మరికొన్ని సంక్షేమ ఫలాలు అందిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ప్రచారం చేశాయన్నారు.అధికారం లోకి వచ్చాక ఏ ఒక్క పథకాన్ని సక్రమంగా అందజేయకపోవడాన్ని ప్రజలంతా ఇప్పటికే గమనించారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని రైతన్నలకు యూరియా అందజేయడంలో తీవ్రమైన జాప్యం జరిగిందన్నారు.వైకాపా పాలన ఐదేళ్ళలో ఏనాడు ఇటువంటి పరిస్థితి దాపురించలేదన్నారు.యూరియా కోసం రైతు రోడ్డు ఎక్కిన పరిస్థితి ఏరోజు లేదన్నారు.రైతే రాజుగా వైసీపీ ప్రభుత్వం రైతును గుర్తించి రైతుల శ్రేయస్సు కోసం పాటుపడిందన్నారు. సెప్టెంబరు నెల వరకు యూరియా ను పంటకు సరిపడినంత సరఫరా చేయకపోవడం ప్రభుత్వం చేతకానితనమేనని స్పష్టం చేశారు. కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని అండగా పార్టీ నిలబడుతుందని చెప్పారన్నారు.అకారణంగా కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్న రాజకీయ నాయకులను,అధికార్ల పేర్లను డిజిటల్ బుక్ లో నమోదు చేయాలని సూచించారన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చాక వారందరిపై చర్యలు తీసుకుంటామని కార్యకర్తలకు భరోసా కల్పించారన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించి ప్రజలకు మేలు జరిగేలా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారని రాజన్నదొర తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రజలను కూల్చే ప్రభుత్వమని, నిరుద్యోగులను నట్టేట ముంచి ఇస్తామన్న నోటిఫికేషన్ లు ఇవ్వకపోగా సూపర్ సిక్స్ లో భాగమైన నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు.మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం హేయనీయ మన్నారు. సమావేశ అనంతరం సాలూరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు రాజన్నదొర చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన వారిలో విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తదితరులు ఉన్నారు.

పార్వతీపురంలో మరో వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాప్ కల్పించిన ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం: ఉద్నా(సూరత్) - బరంపురం మధ్య అమృత్ భారత్ రైలు మంజూరుచేసిన కేంద్ర ప్రభుత్వం పార్వతీపురం, బొబ్బిలిలో హాల్టింగ్ సౌకర్యం లేకపోవడంతో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర హుటాహుటిన ఢిల్లీకి చేరుకొని, రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌కు ప్రజల తరుపున విజ్ఞప్తి చేయడంతోపాటు వినతిపత్రాలను అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన రైల్వే బోర్డు చైర్మన్ 2 స్టేషన్ల లోనూ రైలు నిలుపుదల చేస్తున్నట్లు గంటల వ్యవధిలోనే కొత్త షెడ్యూల్ విడుదల చేయించారు. ఈనెల 27న లాంఛనంగా ఈవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం కానున్నది. పార్వతీపురం మన్యంజిల్లా, నియోజక వర్గప్రజా సంక్షేమం, ఈప్రాంత అభివృద్ధిలో ఎప్పుడూ శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. 2024 సెప్టెంబర్ లో ప్రారంభమైన ప్రతిష్టాత్మక రాయపూర్ - విశాఖపట్నం వందేభారత్ రైలుకు కూడా పార్వతీపురంలో హాల్టింగ్ కల్పించక పోవడంపై వెంటనే బెంగళూరు వెళ్ళిఅప్పట్లో రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నను కలిసి పార్వతీపురంలో వందేభారత్ నిలుపుదల చేసేలా గంటల వ్యవధిలోనే రైల్వే శాఖ కొత్త షెడ్యూల్ జారీ చేయించారు.బుధవారంకూడా అటువంటి ఘటనే చోటుచేసుకుంది. పేద, మధ్య తరగతి వర్గాలకు దూర ప్రాంత ప్రయాణ సౌకర్యం కల్పించేలా అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా ఉద్నా(సూరత్) - బరంపురం అమృత్ భారత్ వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును మంజూరు చేసిందన్నారు. ఈరైలుకు రాయగడ తరువాత విజయనగరంలోనే నిలుపుదల చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించడంతో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర తోపాటు బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయనలు సైతం అభ్యంతరం వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంగాఉన్న పార్వతీపురం, వాణిజ్య కేంద్రంగాఉన్న బొబ్బిలిలో అమృత్ భారత్ వీక్లీ రైలుకు స్టాపేజీ కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిమిత్తం విజయవాడలోఉన్న ఎమ్మెల్యే బోనెల హుటాహుటిన అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లి రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌ను కలిసి, 2 ప్రాంతాల ప్రజల ఆకాంక్ష, డిమాండ్ ను తెలియజేశారు. దీనిపై స్పందించిన రైల్వే బోర్డు చైర్మన్ బొబ్బిలి, పార్వతీపురంలలో స్టాపేజీ కల్పించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎమ్మెల్యే విజయ్ చంద్ర కృషిని అందరూ అభినందించారు. రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ ను కలిసిన సందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వివిధ ప్రతిపాదనలు ఆయన ముందుంచారు. పార్వతీపురం నుంచే హైదరాబాద్, తిరుపతికి రోజువారీ ప్రయాణించేలా రైళ్లు, రాయగడ - విశాఖపట్నం డెయిలీ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ మంజూరు చేయాలని మరో వినతిపత్రం అందజేశారు. అలాగే పార్వతీపురం రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, బెలగాం గేటు వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మించాలని, పార్వతీపురం టౌన్, పార్వతీపురం(బెలగాం) రైల్వే స్టేషన్లను యథావిధంగా కొనసాగించాలని తదితర డిమాండ్లను వినిపించారు. దీనిపై రైల్వే బోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అనుమతులు లభిస్తాయని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆశాభావం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబునాయుడు, యువ నాయకులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ నాయకత్వంలో పార్వతీపురం నియోజకవర్గ ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అడిగిన వెంటనే స్టాపేజీ అనుమతులు మంజూరు చేసిన రైల్వే ఉన్నతాధికారులకు, రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు, రైల్వే బోర్డు చైర్మన్‌కు ఎమ్మెల్యే విజయ్‌చంద్ర కృతజ్ఞతలు తెలియజేశారు.